


ర్యాలీలో మంత్రి తుమ్మల అభివాదం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

5

మంగళవారం 14 అక్టోబరు 2025

ప్రజాస్వామ్యం బతకాలంటే..

ప్రతీ ఒక్కరికి ఓటుండాలి

- 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ప్రజా ఉద్యమం
- లక్ష సంతకాల సేకరణతో కార్యకర్తలు ఖమ్మాన్ని ఆదర్శంగా నిలిపారు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో ఓట్ చోరీ వ్యతిరేక ర్యాలీ
- పార్టీ జిల్లా అధ్యక్షుడికి సంతకాల పత్రాల అందజేత

ఖమ్మం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బీజేపీ ఓట్‌చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం సాగుతోందని, ఈఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఓట్‌చోరీకి వ్యతిరేకంగా ఖమ్మంలో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నగరంలో భారీ నిర్వహించారు. ఈర్యాలీని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించగా.. ఈ ర్యాలీలో పాల్గొన్న తుమ్మల ప్రసంగిస్తూ లక్ష సంతకాలు సేకరించి ఆదర్శంగా నిలిచిన ఘనత ఖమ్మంకాంగ్రెస్ కార్యకర్తలదని కితాబిచ్చారు. ఓటు వినియోగంతోనే ప్రజాస్వామ్య మనుగడ ఉంటుందని, అటువంటి పౌరుల ఓట్లు గల్లంతయింతే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందన్నారు. మంత్రి తుమ్మలక్యాంపు కార్యాలయం నుంచి వైరారోడ్డు మీదుగా కాంగ్రెస్ జిల్లా కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, వర్కింగ్ ప్రసిడెంట్ దీపక్‌చౌదరి నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు. ర్యాలీ అనంతరం నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ జిల్లా కార్యాలయానికి చేరుకుని సంతకాలు సేకరించిన పత్రాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు అందజేశారు.

ప్రపంచస్థాయి నైపుణ్యంతో పోటీపడాలి

- దేశ, విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలి
- విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏటీసీ సెంటర్లు
- సద్వినియోగించుకొని ఉపాధి, ఉద్యోగాల్లో రాణించండి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం ఐటీఐలో ఏటీసీ సెంటర్ ప్రారంభం

6



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు ఈ ఏడాది కూడా కష్టాలు తప్పడం లేదు. సీజన్ ప్రారంభంలో కాస్త ఆలస్యంగా వచ్చిన వానలు.. ఆ తర్వాత ఊపందుకోవడంతో సాగు పనులు ముమ్మరంగా జరిగాయి. పంటలు కూడా ఏపుగా పెరిగాయి. దాంతో ఈ సారి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని భావించిన రైతులకు ప్రస్తుతం పడుతున్న వానలు వారి గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. ఓ వైపు పత్తి.. మరోవైపు వరి చేతికొచ్చే దశలో ఉండటంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తీత దశలో ఉన్న పత్తి నీరుగారిపోతుండటం, రంగుమారుతుండటంతో నాణ్యత లోపిస్తోందని ఆవేదన చెందుతున్నారు. పొట్ట, వెన్ను వేసే దశలో ఉన్న వరి నేలవారుతుండటంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు.

- భయపెడుతున్న భారీ వర్షాలు
- చేతికొచ్చే సమయంలో నీరుగారుతున్న పత్తి
- వరి'వెన్ను' విరుస్తున్న వరుణుడు

రైతుల గుండెల్లో..

వాన దడ



కల్లూరు మండలం గోపాలదేవబోయినపల్లిలో నేలవాలిన వరి పైరు

బోనకల్ / కల్లూరు, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది కూడా ప్రకృతి రైతులపై కన్నెర్ర చేస్తోంది. వరుణుడి రూపంలో వారి ఆశలకు గండి కొడుతోంది. పంటలు చేతికందే దశలో వస్తున్న వరుస వానలు వారిని నట్టేట ముంచుతున్నాయి. జిల్లాలోని బోనకల్, మధిర, ఎర్రుపాలెం, ముదిగొండతో పాటు పలు మండలాల్లో అత్యధికంగా పత్తి పంటను సాగు చేశారు. అన్ని ఖర్చులు కలిపి పెట్టుబడిగా ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట ఏపుగా పెరగడంతో ఈ సారి పంట కలిసి వస్తుందని రైతులు ఎంతగానో సంతోషించారు. ప్రస్తుతం కాయలు పగిలి దూది తీసే దశలో ఉండగా.. వరుసగా కురుస్తున్న వానలతో పత్తి గుబ్బల్లో నీరు చేరి రంగు మారుతుంది. ఈ క్రమంలో వానల భయానికి పత్తినంతా ఒకేసారి తీసేందుకు రైతులు ఆరాట పడుతుండగా.. వారికి కూలీల కొరత పెద్ద సమస్యగా మారింది. స్థానికంగా కూలీలు దొరకకపోతుండటంతో ఏపీతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లి రైతులు కూలీలను తీసుకొస్తున్నారు. కిలో పత్తి తీసినందుకు రూ.16 ఇవ్వడంతో పాటు రోజూ రవాణా ఖర్చులు రూ. 2వేలచొప్పున అవుతుంది. అయితే ఈ సారి భారీ వర్షాల కారణంగా పత్తి దిగుబడి తగ్గిందని, ఎకరానికి 2క్వింటాళ్ల నుంచి 5 క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానల వల్ల పత్తి రంగు మారుతుండటంతో పంట ఇంటికి తీసుకొచ్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.



బోనకల్‌లో తడిసిన పత్తి

వరి రైతులు బిక్కుబిక్కు

జిల్లాలోని ఎన్నెస్పీ ఆయకట్టు కింద అధికంగా వరి సాగయ్యింది. ప్రస్తుతం కొన్నిచోట్ల ఆ పంట గింజ పాలు పోసుకొని దశలో ఉండగా.. ముందుగా వరి వేసిన చోట్ల మరో వారం, పది రోజుల్లో కోతకు కూడా వచ్చే అవకాశం ఉంది. కానీ ఇప్పుడు (మిగతా 8వ పేజీలో)

సీసీఐ కోసం ఎదురు చూపులు

పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గుతుండటంతో పాటు పండించిన పంటకు ధర కూడా లేక పోవడంతో రైతులు కష్టానికి తోడుగా నష్టాన్ని చవిచూస్తున్నారు. పంట రంగు మారిందన్న కారణం చూపి ప్రైవేటు వ్యాపారులు క్వింటా పత్తిని రూ. 5,300 నుంచి రూ.6వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇంట్లో నిల్వ ఉంచలేక వ్యాపారులు అడిగిన ధరలకు రైతులు అమ్మాల్సిన దుస్థితి నెలకొంది. సీసీఐ ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంతో రైతుల వద్దనున్న పత్తి పంటంతా వ్యాపారుల చేతుల్లోకి వెళుతోంది. ఆలస్యంగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, రైతులకు అంతంత మాత్రంగానే ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయాలున్నాయి.

ప్రజావాణి దరఖాస్తులను

సత్వరమే పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలనుంచి అందే ప్రతి దరఖాస్తును పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల్లో ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రీవెన్స్‌లో అందే ప్రతి అర్జీకి పరిష్కారాన్ని చూపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, డీఆర్వో ఏ పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కుటుంబరావు తన సర్వే నెంబర్ 26లో 10గుంటల భూమి వారసత్వంగా వస్తుందని తన పేరుతో రికార్డులో చేరి పాస్‌పుస్తకాన్ని మంజూరు చేయాలంటూ కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు.
- తమ ప్రాంతలో సివిల్ కాంట్రాక్ట్ కంపెనీ హెవీ వెహికిల్స్ అధిక లోడుతో వెళ్తున్నాయని వీటి వల్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని, రోడ్లు ధ్వంసం అయిపోతున్నాయంటూ 48వ డివిజన్ దానవాయిగూడెం పార్కు ప్రాంత ప్రజలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.
- తన కూతురుకు కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నానని, నేటికీ దాన్ని మంజూరు చేయంలేదంటూ ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన భవాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.
- టేకులపల్లి గ్రామానికి చెందిన సాకేతాచారి తాను 90శాతం వైకల్యంతో బాధపడుతున్నానని తనకు ఉపాధి అవకాశాన్ని కల్పించాలంటూ కలెక్టర్‌ను వేడుకున్నాడు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి

కలెక్టర్‌కు అఖిల భారత ఐక్య రైతు సంఘం వినతి

ఖమ్మం అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సోమవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతి పత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తొలుత ఖమ్మం పత్తి మార్కెట్‌ను సందర్శించి రైతు సమస్యలను పరిశీలించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి రైతుల ఇబ్బందులను వివరించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవటంతో రైతులకు గిట్టుబాటు ధరలు దక్కక నష్టపోతున్నారని చెప్పారు. పత్తి రైతులు వ్యయప్రయాసలకోర్చి పత్తిని మార్కెట్‌కు తీసుకు వస్తే దళారులు గిట్టుబాటు ధర రానీయకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. ధరల విషయంలో, కాటాల విషయంలో రైతులు నష్టపోతున్నారన్నారు. ఖాళీబస్తాను రైతులు రూ.70 వరకు కొనుగోలు చేస్తుండగా మార్కెట్‌లో వ్యాపారులు రూ.25 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. రైతులకు బస్తాకు రూ.50 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సఘం రాష్ట్ర నాయకుడు ఆవుల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కమ్మకోమటి నాగేశ్వరరావు, కేలోతు లక్ష్మణ్ పాశం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి దేవస్థానంలో ఉద్యోగులకు

అంతర్గత బదిలీలు

భద్రాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అంతర్గత బదిలీలు చేస్తూ సోమవారం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం సిబ్బంది విధుల్లో మార్పులు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంటు ఎ.శ్రీనివాసరెడ్డి సీసీటూ ఈవో, గోశాల ఫైల్ కరస్పాండెన్స్‌తో పాటు సెంట్రల్ స్టోరు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. సీనియర్ అసిస్టెంటు ఆర్.బాలాజీ ప్రసాదాల తయారీ విభాగానికి బాధ్యతలు స్వీకరించనున్నారు. రికార్డు అసిస్టెంటు బీకేవీవీఎస్ శ్రీనివాసరావును పర్ణశాల గుమ్మస్తాగా బదిలీ చేశారు. ఎం.అనిల్‌కుమార్ ఎస్టాబ్లిష్‌మెంటు, పేబిల్స్, టి.రాకేష్‌ను క్యాషియర్, డిపాజిట్ల రిజిష్టర్స్ నిర్వహణ, ఎఫ్‌డీఆర్ రిజిష్టర్స్ నిర్వహణ, ఇతర ఆర్థికపరమైన రిజిష్టర్ల నిర్వహణ వీటికి అదనంగా ఆన్‌లైన్ అకౌంట్స్ ప్రొసీజర్స్ బాధ్యతను అప్పగించారు. ఇదే రీతిలో మరో 11 మంది రికార్డు అసిస్టెంటు, ఆఫీసు సబార్డినేట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం పని చేస్తున్న స్థానాన్ని మరో విభాగానికి బదలీ చేశారు.



కీలక విభాగాల బాధ్యత కేటాయింపులపై సర్వత్రా విమర్శలు

దేవస్థానంలో కీలక విభాగాల బాధ్యతల కేటాయింపులో రెగ్యులరు ఉద్యోగులను పరిగణలోకి తీసుకోకుండా తాత్కాలిక ఉద్యోగులను బాధ్యులుగా నియమించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్థికపరంగా ఆధారపడి ఉన్న విభాగాల కీలక బాధ్యతలు పూర్తిస్థాయిలో రెగ్యులరు ఉద్యోగులకే ఇవ్వాలనేది నిబంధనల మేరకు ఉందని (మిగతా 6వ పేజీలో)

బీసీలను రాజకీయంగా పైకి తీసుకొచ్చింది టీడీపీనే

- శ్రేణుల కృషితో జిల్లాలో సభ్యత్వ నమోదు సక్సెస్
- పార్టీ రాష్ట్ర ముఖ్య నేత బక్కని నర్సింహులు

6

యాచకులు లేని నగరాల కోసం..

- కార్యాచరణ ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెప్మా సర్వే
- యాచకుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది
- బయటపడుతున్న పలు ఆసక్తికర అంశాలు



ఆలయ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

శ్రీవారి ఆలయ నిర్మాణంపై అధికారులకు

మంత్రి తుమ్మల సూచనలు

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులతో ఖమ్మం అల్లీపురంలో నిర్మించబోతున్న శ్రీవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచనలు చేశారు. సోమవారం ఖమ్మంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీవో గరిడి నరసింహారావు, (మిగతా 6వ పేజీలో)

ఆ 'రహస్యం'..

'అక్షర' సత్యం

- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం
- హైవేపై సీసీ కెమెరాల పరిశీలన.. మరమ్మతులకు ఏర్పాట్లు
- 'ఆంధ్రజ్యోతి'కి అభినందనల వెల్లువ



తెర వెనుక రహస్యమేంటో?

'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనం

అశ్వారావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇసుక మాఫియా ఆగడాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'తెర వెనుక రహస్యమేంటో' కథనం జిల్లాలో సంచలనం రేపింది. ఇసుక కార్యకలాపాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు కలిగిన అక్రమార్కుల గుండెల్లో ఈ కథనం గుబులు రేపింది. అదే సమయంలో జిల్లావాసుల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇసుక మాఫియాపై వచ్చిన 'రహస్య' కథనం అక్షర సత్యమంటూ ప్రశంసించారు. పట్టణంలో ఏ ఇద్దరు కలిసినా సీసీ కెమెరాలు ఏమయ్యాయి? ఎందుకు పని చేయడం లేదు? అశ్వారావుపేట మీదుగా వివిధ రకాల స్మగ్లింగ్ జరుగుతుండడంతోనే ఎవరైనా సీసీ కెమెరాలను తప్పించి ఉంటారా!? అన్న విషయాలపై చర్చించుకున్నారు. మరోవైపు.. 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పెషల్ బ్రాంచ్‌తో పాటు పలు విభాగాల పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఉదయమే మందలపల్లి నుంచి అశ్వారావుపేట బోర్డర్ వరకు సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఉన్నాయి!? వాటి పని విధానం ఏ విధంగా ఉందో!? అని పరిశీలించారు. వాటి మరమ్మతులకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో సంబంధిత టెక్నీషియన్‌లతో మాట్లాడినట్టు సమాచారం. అంతేకాక తక్షణమే హైవే వెంట ఉన్న పెట్రోలు బంకులు, చెక్ పోస్టులు, ప్రధానమైన దుకాణాదారులు రహదారి కనపడేలా సీసీ కెమెరాలు ఏర్పాటు (మిగతా 6వ పేజీలో)



మార్కెట్‌లో తడిసిన పత్తి బస్తాలు

వర్షంతో మార్కెట్లో.. తడిసిన పత్తి బస్తాలు

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం ఉదయం కురిసిన వర్షానికి వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి బస్తాలు స్వల్పంగా తడిశాయి. ఉదయం ఒక్కసారిగా వర్షం పడడంతో.. రైతులు టార్పాలిన్ పట్టాల కోసం మార్కెట్ కార్యాలయం వైపు పరుగులు తీశారు. పట్టాలు తెచ్చే లోపే వర్షం జోరందుకోవడంతో కొంత మేర పత్తి బస్తాలు తడిసి ముద్దయ్యాయి. మార్కెట్‌కు సోమవారం సుమారు 16 వేల పత్తి బస్తాలు అమ్మకానికి రాగా.. వ్యాపారులు క్వింటాలు పత్తిని గరిష్ఠంగా రూ. 7,100లకు కొనుగోలు చేయగా కనిష్ఠంగా రూ. 4,500లకు నమూనా రకాలను రూ. 6,300లకు కొనుగోలు చేశారు. ఈక్రమంలో వర్షానికి తడిసిన పత్తి కొంత మేర తక్కువ ధరకు పలికాయని రైతులు పేర్కొంటుండగా.. వచ్చిన బస్తాలలో 80శాతం అంటే.. సుమారు 14వేల బస్తాల వరకు క్వింటాలు రూ. 6,500 ల నుంచి రూ. 7,000ల వరకు ధరలు పలికాయని మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తదితరులు సమీక్షించారు.



వర్షానికి టార్పాలిన్ పట్టాలను కప్పుతున్న రైతులు

ప్రపంచస్థాయి నైపుణ్యంతో పోటీపడాలి

- దేశ, విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలి
- విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏటీసీ సెంటర్లు
- సద్వినియోగించుకొని ఉపాధి, ఉద్యోగాల్లో రాణించండి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం ఐటీఐలో ఏటీసీ సెంటర్ ప్రారంభం



ఏటీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ప్రపంచ స్థాయి నైపుణ్యంతో పోటీ పడి దేశ, విదేశాల్లో ఉద్యోగాలు సాధించాలని.. ఇందుకు అవసరమైన మెరుగైన వృత్తినైపుణ్య శిక్షణను ఏటీసీసెంటర్ల ద్వారా అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సమాజంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేసిందని.. ఈ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మం ఐటీఐలో సోమవారం నూతనంగా నిర్మించిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు టాటా స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో ఏర్పాటుచేసిన వివిధ కోర్సుల్లో విభాగాలను మంత్రి తుమ్మల సందర్శించి ఆయా కోర్సుల ద్వారా విద్యార్థులకు కలిగే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి తుమ్మల మాట్లాడుతూ.. రాబోయే టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. చదువుతో పాటు వృత్తి నైపుణ్యం పెంపొందించుకుంటే విద్యార్థుల వద్దకే అవకాశాలు వస్తాయని.. ఉద్యోగాల కోసం తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. వృత్తి నైపుణ్యం ఉంటే ఐటీఐలోనే పరిశ్రమలు, కంపెనీలు వచ్చి ఉద్యోగాలు ఇచ్చి తీసుకెళ్తాయన్నారు. ప్రపంచీకరణలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి ఏటీసీ కోర్సు డిజైన్ చేశారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్న ఈ కోర్సులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలిపిస్తాయని, తద్వారా దేశ, విదేశాల్లో ఉద్యోగాలు పొందే సదుపాయం కలుగుతుందన్నారు. నైపుణ్యం ఉంటే యువత ప్రపంచంలో ఎక్కడైనా రాణించడం జరుగుతుందని, దీనివల్ల ఆయా కుటుంబాలు ఆర్థికంగా ముందడుగు వేస్తాయన్నారు. ప్రపంచంలో ఎలక్ట్రికల్ వాహనాలు, రోబోటిక్ సేవలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. గతంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో డిమాండ్ ఉండేదన్నారు. కానీ ఇప్పుడు చాలా కాలేజీల్లో సరైన సాంకేతిక నైపుణ్యత లోపించిందని, ఇంజనీరింగ్ కాలేజీలు అప్‌డేట్ కాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన యువత లభించడం లేదన్నారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, మణుగూరు, భద్రాచల, కొత్తగూడెంలో ఏటీసీ సెంటర్‌లు ఏర్పాటు చేశారన్నారు విద్యార్థులు రెండేళ్ల కోర్సు చదవడంతో పాటు దేశ, విదేశాల్లో ఉండే ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా విద్యార్థుల భవిష్యత్ మారబోతుందని, డిమాండ్ ఉన్న కోర్సులను ప్రభుత్వం డిజైన్ చేసిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో పాక్స్‌కాన్ ఇయర్‌ప్యాడ్ ఉత్పత్తి పరిశ్రమ ఉందని, ఏటీసీలో రోబోటిక్ పూర్తిచేసిన వారికి అలాంటి పరిశ్రమల్లో మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. ఐటీసీ పేపర్ బోర్డులోనూ ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాలు అధికంగా వస్తున్నందు వల్ల ఈ కోర్సు చదివిన వారికి పెద్దగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ..దేశంలో స్కిల్ గ్యాప్ బాగా ఉందన్నారు. విద్యార్థులు చేసే కోర్సులకు, బయట విద్యకు అవకాశాలకు వ్యత్యాసం వల్ల సకాలంలో యువత ఉద్యోగాలు పొందడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సమన్వయంతో ఏటీసీ సెంటర్లు ఏర్పాటుచేయడం హర్షనీయమన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల చొరవతో ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేయడం.. అక్కడ ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు మంచి అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, కార్మికశాఖ సహాయ కమిషనర్ కృష్ణవేణి, ఆర్డీవో నరసింహారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, అర్బన్ తహసీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శిస్తున్న కలెక్టర్

పాఠశాల వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యాలు, పాఠశాల వసతుల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం పాత కొత్తగూడెం ప్రాంతంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, వసతులు, మధ్యాహ్న భోజన వంటశాల, శానిటేషన్ వ్యవస్థలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన వంటశాలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత, శుభ్రత, మెనూ వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం ముఖ్యమైన పాత్ర వహిస్తున్నందున, ప్రతీ రోజు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని సూచించారు. గుడ్లు, కూరగాయలు, పాలు వంటి పోషక పదార్థాలను తప్పక భోజనంలో చేర్చాలని ఆదేశించారు. కలెక్టర్ గుడ్లు వండుతున్నారా!? అని ప్రశ్నించినప్పుడు సిబ్బంది, టెండర్ సంస్థ నుంచి సరఫరా లభించలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న యూఆర్ఎస్, కేజీబీవీఎస్ పాఠశాలల్లో కూడా ఎలాంటి సమస్యలు ఉన్నాయో గుర్తించి తక్షణమే నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి తాత్కాలిక తరగతి గదులకు కేటాయించబడిన భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనందఖనిలో ఉన్న భవన సముదాయాన్ని పరిశీలించి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ వారు సూచించిన సూచనలకు అనుగుణంగా మార్పులు చేయుటకు ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం వరకు కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభించేటట్లుగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

పరవళ్లు తొక్కుతున్న కిన్నెరసాని

- అసలు సామర్థ్యానికి చేరిన నీరు
- 5 గేట్లు ఎత్తి నీటి విడుదల

పాల్వంచ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కిన్నెరసాని వరద నీటితో కిన్నెరసాని జలాశయం ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటితో నిండింది. సోమవారం జలాశయం నీటిమట్టం 406.80 అడుగులకు చేరడంతో 5 గేట్లను ఎత్తి 24 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అసలు సామర్థ్యం 407 అడుగులు కాగా.. 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతుండడంతో జలాశయం అధికారులు అప్రమత్తం అయ్యారు. మహబూబాబాద్ , పాకాల, గుండాల, ఇల్లెందు అటవీ ప్రాంతాల నుంచి కొత్తగూడెం టేకులపల్లి మీదుగా వరద నీరు భారీగా చేరుతోంది. రాత్రి కురిసిన వర్షానికి మరింత వరద ప్రవాహం పెరిగింది. వెంటనే జెన్కో అధికారుల ఆదేశానుసారంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. గేట్లను ఎత్తిన నేపథ్యంలో కిన్నెరసాని వాగులు దాటవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పాల్వంచ, బూర్గంపాడు మండలాల కిన్నెరసాని పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటి తగ్గు ముఖాన్ని అంచనా వేసుకుంటూ నీటిని విడుదల చేయనున్నట్లు డ్యామ్ ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



కిన్నెరసాని గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

తాలిపేరుకు భారీ వరద.. 12 గేట్ల ఎత్తివేత

చర్ల, అక్టోబరు 13 ఆంధ్రజ్యోతి) : చర్లతో పాటు ఛత్తీస్‌గడ్‌లో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 25 గేట్లలో 12 గేట్లు ఎత్తి 22 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా వాగులు పొంగి పొర్లు తున్నాయని, మంగళవారం కూడా ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు డీఈ తిరుపతి తెలిపారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 73.29 మీటర్లు కాగా.. ఇన్‌ఫ్లో 20 వేల క్యూసెక్కులుగా ఉంది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తే అవకాశం ఉందని దిగువ ప్రాంతాల్లో ఎవ్వరూ చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.



తాలిపేరు ప్రాజెక్టు గేట్ల నుంచి నీటి విడుదల



స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముత్తంగి అలంకరణలో భద్రాద్రి రామయ్య

భద్రాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నా రు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చ న, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు.

దేవస్థానంలో ఉద్యోగులకు అంతర్గత బదిలీలు

(5వ పేజీ తరువాయి)

దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో అవినీతి, అవకతవకలు ఎదుర్కొంటున్న వారిని ఆర్థికేతర విభాగాల్లో నియమించాల్సి ఉందని, కానీ తాజా ఉత్తర్వుల్లో ఆరోపణలు ఉన్న కొందరికి ప్రాధాన్యత స్థానాల్లో చోటు కల్పించడం నిబంధనలకు విరుద్ధమనే ప్రచారం ఉంది. రెగ్యులరు ఉద్యోగుల స్థానంలో తాత్కాలిక ఉద్యోగులను ఆ విభాగంకు బాధ్యులుగా చేస్తే వారు ఆర్థికపరమైన అవకతవకలు, అవినీతికి పాల్పడి వెళ్లిపోతే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని రామ భక్తులు ప్రశ్నిస్తున్నారు. రామాలయంలో అత్యంత కీలక విభాగానికి బాధ్యులను సైతం తాత్కాలిక సిబ్బందినే నియమించడం విమర్శలకు తావిస్తోంది. మరో వైపు పరిపాలన విభాగంలో అత్యంత కీలకమైన విభాగాలకు చేసిన బదిలీలపై సైతం దేవస్థానం వర్గాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెగ్యులరు ఉద్యోగులను విస్మరించి తాత్కాలిక ఉద్యోగులకు పెద్దపీట వేయడం పట్ల దేవస్థానం వర్గాల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ‘రహస్యం’.. ‘అక్షర’ సత్యం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవాలని ఆయా యాజమాన్యాలకు పోలీసులు సూచించారు. ఇందుకు తగ్గట్టుగానే జిల్లా పోలీస్ బాస్ సంబంధిత పోలీసు సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా!? లేదా!? అన్న సమాచారాన్ని తీసుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ.. ఎన్నో నెలలుగా మూలన పడి ఉన్న సీసీ కెమెరాలకు ఎట్టకేలకు ‘ఆంధ్రజ్యోతి’ ద్వారా మోక్షం లభించనుంది. అదే సమయంలో కొంత మేర అక్రమ వ్యాపార లావాదేవీలకు బ్రేక్ పడే అవకాశాలున్నాయి. మొత్తమ్మీద ఇసుక మాఫియా ఆగడాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ‘ఆంధ్రజ్యోతి’కి అన్ని వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీవారి ఆలయ నిర్మాణంపై అధికారులకు మంత్రి తుమ్మల సూచనలు

(5వ పేజీ తరువాయి)

అర్బన్ ఎంఆర్‌వో సైదులు, నగర మేయర్ నీరజతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి అవసరమై భూముల విషయంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, భక్తులకు అనువుగా ఉండేలా ఆలయ నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. మరో రెండు రోజుల్లో టీటీడీ బృందం భూములను పరిశించేందుకు రానుందని, వారికి కావాల్సిన ఏర్పాట్లను చేయాలన్నారు. కొత్తగుడెం, అల్లీపురం ప్రాంతాలలోని భూములను టీటీడీ అధికారుల బృందం పరిశీలించి అనువుగా ఉన్న భూములను ఎంపిక చేస్తారని అన్నారు. ఈ ఆలయంతో నగరం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తుమ్మల వెంట వెంకటాయపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వెయ్యి క్వింటాళ్ల బియ్యం సీజ్

నేలకొండపల్లి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు వద్ద ఉన్న దుర్గాభవాని మిల్లులో పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యా న్ని అధికారులు కనుగొన్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. సివిల్ సప్లై, పోలీస్ అధికారులు సోమవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో దాదాపుగా 1000 క్వింటాళ్ల వరకు బియ్యం ఉన్నట్లు కనుగొన్నారు. నాలుగు రకాల బియ్యం నమూనాలను పరీక్ష నిమిత్తం పం పారు. సివిల్ సప్లై డీటీ నాగలక్ష్మి, మెచ్చా రాంబాబు, టెక్నికల్ అధికారి సు నీత, నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు

ఖమ్మంక్రైం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై ఖమ్మం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. జహీర్‌పురకు చెందిన గోపి అనే యువకుడు ఒంటరిగాఉన్న అదే ప్రాంతానికి చెందిన ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెచ్చిపోతున్న ఇసుక తోడేళ్లు!

- అధికార పార్టీ నేత పేరు చెప్పి.. జిల్లాలో చెలరేగి పోతున్న ఇసుక మాఫియా
- రాత్రి వేళ ఆళ్లపల్లి, గుండాల సరిహద్దు నుంచి అడ్డగోలుగా తరలింపు
- అనతి కాలంలోనే రూ.లక్షలు గడిస్తున్న అక్రమార్కులు
- ‘మామూళ్ల’ మత్తులో అధికారులు



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

ఆళ్లపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక తోడేళ్ల రెచ్చిపోతున్నారు. అందినకాడిని ఇసుకను తోడేస్తూ.. రాత్రి వేళల్లో గుట్టుగా తరలిస్తూ.. అనతికాలంలోనే రూ.లక్షలు గడిస్తున్నారు. ఎవరైనా అడ్డొస్తే అధికార పార్టీ నేత పేరు చెబుతూ.. అటు అధికారులు, ఇటు ఇసుక మాఫియా.. ఇద్దరూ కలిసి ఆళ్లపల్లి, గుండాల మండలాల సరిహద్దు కాచనపల్లిలో దర్జాగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం రాయిపాడు, జిన్నెలగూడెం గ్రామాల్లోని కిన్నెరసాని వాగు నుంచి ఇల్లెందు నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక రవాణా కొనసాగుతోంది. ఇదే అదునుగా మార్చుకున్న ఆళ్లపల్లి మండలంలోని ఓ ప్రధాన శాఖ అధికారి.. ఖమ్మం జిల్లాలో అక్రమ ఇసుక రవాణా చేసే వ్యక్తులను పరిచయం చేసుకున్నాడు. వారితో చేతులు కలిపి ఇసుకను తరలిస్తూ.. అందరూ కలిసి ఎంచక్కా సొమ్ము చేసుకుంటున్నారు. కిన్నెరసాని వాగు నుంచి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పేరుతో ఒక కూపన్‌పై రెండు, మూడు ఇసుక ట్రిప్పులు తోలకాలు చేపట్టడం, స్థానిక ట్రాక్టర్ల ద్వారా బాటన్ననగర్ నుంచి ఇసుక తోలకాలు చేపట్టి గుట్టుచప్పుడు కాకుండా కాచనపల్లి, జగ్గుతండా పరిధిలో డంపు చేస్తున్నారు. ఇలా డంప్ చేసిన ఇసుకను రాత్రి వేళలో ఎక్స్‌కవేటర్(జేసీబీ) ద్వారా టిప్పర్, లారీల్లో ఇసుకకు డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. అదీ ఏ అనుమతి లేకుండా, చెక్‌పోస్టులు దాటుకుంటూ దర్జాగా తరలిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ‘మేము ఎవరో తెలుసా.. మా వెనుక బలం ఏంటో తెలుసా..?’ అంటూ ధైర్యంగా ఇసుక అక్రమ రవాణాకు తెగబడుతున్నారు. ఈ ప్రాంత ఆదివాసీలు అమాయకులు కావడంతో అధికారులు చెప్పిందే వేదంగా చెల్లుబాటు అవుతోంది. లేదంటే ఏదో ఒక సమస్యపై ఇరికించి ముప్పతిప్పలు పెడతారని భావించిన ఆదివాసీలు కూడా మౌనంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఆగస్టు 6న ఇందిరమ్మ ఇంటికి కూపన్లు లేకుండా వెళుతున్న ఇసుక ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకోవడంతో.. రాయిపాడు కార్యదర్శి, అప్పటి తహసీల్దారు అప్పటికప్పుడు కూపన్లు జారీ చేయడం గమనార్హం. గత జూలై 20న సెలవు అయినప్పటికీ కూపన్లు లేకుండా ఇల్లెందులోని ఇందిరమ్మ ఇళ్లకు తరలుతున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకోవడంతో.. రెవెన్యూ అధికారులు తమకేం తెలియనట్టుగా వచ్చి సీజ్ చేశారు. అలాగే ఈ నెల 8న ఆళ్లపల్లి అటవీశాఖ అధికారులు ఇదే నెల 4వ తేదీపై ఉన్న కూపన్ల ద్వారా ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను తోలుతున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. ఈ వ్యవహారమంతా చూస్తే కొంత కాలం నుంచి ఇసుక అక్రమ రవాణా వెనుక స్థానికంగా ఉన్న ఓ శాఖ అధికారి చక్రం తిప్పుతున్నాడా..? లేక ఈ వ్యవహారంలో ఇతర శాఖల అధికారుల హస్తం ఏమైనా ఉందా..? అని గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

నిద్ర మత్తులో తనిఖీ బృందాలు

ఏజెన్సీ మండలాల నుంచి అక్రమంగా ఇసుక, కలప, బియ్యం, గుట్కాలతో పాటు పశువులనూ తరలిస్తున్నా.. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కుల భరతం పట్టేందుకు కాచనపల్లి నుంచి అడుగడుగునా చెక్‌పోస్టులు, పోలీసు తనిఖీ బృందాలు ఉన్నప్పటికీ.. చెక్‌పోస్టుల్లోని సిబ్బంది మామూళ్ల మత్తులో మొద్దు నిద్ర పోతున్నారు. కాచనపల్లిలో పోలీస్‌స్టేషన్, దానికి ఎదురుగా అటవీశాఖ కార్యాలయం, చెక్‌పోస్టు, కొమరారంలో అటవీశాఖ కార్యాలయం, తరువాత రొంపేడ్ చెక్‌పోస్టు, ఇల్లెందులో అటవీ శాఖ కార్యాలయం పోలీస్, రెవెన్యూ, అటవీశాఖ తనిఖీలు.. ఇవన్నీ దాటుకుంటూ లారీల్లో అక్రమంగా ఇసుక పట్టణాలకు తరలిపోతుందంటే.. మండల స్థాయి అధికారుల హస్తం ఎంతలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. కనీసం ఇకనైనా అక్రమ ఇసుక రవాణా వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించి.. ఇసుక తోడేళ్లకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యాచకులు లేని నగరాల కోసం..

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెప్మా సర్వే
- బయటపడుతున్న ఆసక్తి కలిగించే అంశాలు

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యాచకులు లేని నగరాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేస్తున్నాయి. ఈ మేరకు గత రెండు రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా సత్తుపల్లి, వైరా, మధిర, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. టీఎంసీలు, సీవోలు, ఆర్పీలు నేరుగా సర్వేలో పాల్గొంటున్నారు. ప్రభుత్వం సూచించిన నమూన మేరకు యాచకుల వివరాలను నమోదు చేస్తున్నారు. యాచికులు ఆర్థిక, సామాజిక, కుటుంబ పరిస్థితులు నమోదు చేస్తున్నారు. ఏదైనా ఆశ్రమంలోకి వెళ్లేందుకు ఇష్టంగా ఉంటున్నారా!? ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా యాచించటం మానివేస్తారా!? అనే పలు అంశాలను నమోదు చేస్తున్నారు.

ఆసరా పొందుతూ కూడా..

గత రెండు రోజులుగా జరుగుతున్న సర్వేలో మెప్మా అధికారులకు పలు ఆసక్తి కలిగించే అంశాలు సర్వేలు బయట పడుతున్నాయి. యాచించే వారిలో ఎక్కువ మందికి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. పైగా ఏదో ఒక రకమైన ఆసరా పింఛన్లు పొందుతున్నారు. కాని ఉదయం నుంచి రాత్రి వరకు బయటకు వచ్చి ఏదో యాచించటం ఒక అలవాటుగా పెట్టుకున్నారు. మరి కొంతమంది మాత్రం మానసిక పరిస్తితి బాగోలేక, చెడు వ్యసనాలకు అలవాటు పడి అనారోగ్యానికి గురైన వారి దీనగాథలు నమోదు జరుగుతున్నాయి. మరో మూడు రోజులు పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపాటీల్లో యాచికల సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపేందుకు మెప్మా అధికారులు సర్వేను వేగవంతం చేశారు.



యాచకురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న టీఎంసీ సుజాతరాణి



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

బీసీలను రాజకీయంగా పైకి తీసుకువచ్చింది టీడీపీనే

- పార్టీ రాష్ట్ర ముఖ్య నేత బక్కని నర్సింహులు

మధిర రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ వర్గాలను రాజకీయంగా పైకి తీసుకువచ్చింది తెలుగుదేశం పార్టీనేనని ఆ పార్టీ రాష్ట్ర ముఖ్య నేత బక్కని నర్సింహులు అన్నారు. సోమవారం మధిరలో జరిగిన టీడీపీ నియోజకవర్గస్థాయి పునర్నిర్మాణ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో చాలామంది బీసీ నాయకులకు రాజకీయంగా మంచి అవకాశాలు దక్కాయన్నారు. తెలంగాణలో టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతమైందన్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో సభ్యత్వ నమోదును నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సక్సస్ చేశారని కొనియాడారు. టీటీడీ బోర్డు డైరెక్టర్ నల్లూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో జరగబోయే తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అధ్యక్షతన జరి గిన సమావేశంలో నాయకులు చేకూరి శేఖర్‌బాబు, మల్లాది హన్మంతరావు, వేమూరి సునీల్‌కుమార్, చెరుకూరి కృష్ణారావు, వేల్పుల కొండ, వంగాల రామకోటి పాల్గొన్నారు.

కార్మికుల ఆకలి బాధలు కనిపించవా?



ఐటీడీఏ ఎదుట అవుట్‌సోర్సింగ్ డైలీవేజ్ కార్మికుల నిరసన



నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మధు

కార్మికుల నోటికాడి బువ్వ గుంజుకుంటున్న కాంగ్రెస్ సర్కారు

డైలీవేజ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు

ఐటీడీఏ ముందు రోజువారీ కార్మికుల 72 గంటల మహా నిరసన ప్రారంభం

భద్రాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులకు గిరిజన కార్మికుల ఆకలి బాధలు కనిపించడం లేదాని డైలీవేజ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు విమర్శించారు. 32రోజులుగా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న గిరిజన వసతి గృహాల రోజువారీ కార్మికుల నోటికాడ బువ్వను కాంగ్రెస్ సర్కారు గుంజుకుంటోందని ఆరోపించారు. భద్రాచలంలోని ఐటీడీఏ భవనం ఎదుట గిరిజన కార్మికుల 72గంటల మహా నిరసన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డైలీవేజ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ డైలీవేజ్ వర్కర్లకు టైంస్కేలు ఇవ్వాలని, అప్పటివరకు కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ వర్కర్లకు రూ.15,600 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్యబీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన ప్రజాప్రతినిధులు సీఎంతో మాట్లాడి గిరిజన కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని విద్యార్థులు వంటచేస్తూ మగ్గిపోతుంటే విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు పరిశుభ్రత పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక్కొక్క కార్మికుడు నెలకు రూ.16వేలు నష్టపోయారన్నాని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న ఐటీడీఏ పరిధిలోని ఒక్కో ఐటీడీఏ కార్యలయంకు ఒక్కొక్క విధానంను కొనసాగి స్తూ కార్మికుల పొట్టకొట్టడం సరైంది కాదన్నారు. జీతాలు తగ్గిస్తే గిరిజన సంక్షేమశాఖ ఉద్యోగులు పనిచేస్తారాని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి స్పష్టం చేశారు. 72 గంటల్లో ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు.

రాత్రి సైతం కొనసాగిన నిరసన

ప్రారంభమైన 72 గంటల నిరసన రాత్రి సైతం కొనసాగింది. వర్షం వచ్చినా కార్మికులు ఎక్కడికి వెళ్లకుండా ఐటీడీఏ ప్రధాన ద్వారం వద్దే నిరసన కొనసాగించారు. ఇదే సమయంలో వంటావార్పును నిర్వహించారు. ఇదిలా ఉండగా డైలీవేజ్ వర్కర్లు నిర్వహిస్తున్న నిరవధిక నిరసనకు వివిధ ప్రజా సంఘాల నుంచి మద్దతు లభిస్తుంది. ఈ కార్యక్రమాల్లో డైలీవేజ్ కార్మికుల జిల్లా కార్యదర్శి హీరాలాల్, నాగేశ్వరరావు, మంగమ్మ, మంగీలాల్, స్వామి జలందర్, తిరుపతమ్మ, ఈశ్వర్ పాల్గొన్నారు. అధికారుల సూచన మేరకు దినసరి కూలీలు గిరిజన భవన్‌లో రాత్రి విశ్రాంతి తీసుకున్నారు.

ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో రాహుల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గిరిజన యువకుడు లావుడియా రమేష్‌బాబు రచించిన బియాండ్ టెక్స్‌బుక్స్ ది సాగా ఆఫ్ సైంటిఫిక్ ఎవేకనింగ్ (పాఠ్య పుస్తకాలకు మించి శాస్త్రీయ మేలుకొలుపు గాథ) అనే ఆంగ్ల పుస్తకాన్ని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ సోమవారం ఆవిష్కరించారు. భద్రాచలం ఐటీడీఏ పీవో ఛాంబర్‌లో రచయితతో కలిసి ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో శాస్త్రీయ అవగాహన, విజ్ఞానదృక్పదం, సమాజంలో శాస్త్ర సాహిత్య, ప్రాముఖ్యతపై రచయిత తన ఆలోచనలను, అనుభవాలను సూటిగా స్ఫూర్తిదాయకంగా వివరంచారు. ఇదే క్రమంలో శ్రీవిద్య పాఠశాలలో సైతం రచయిత రమేష్‌బాబు విద్యార్థులకు శాస్త్రీయ విద్య కేవలం పుస్తకాలే పరిమితం కాదు, అది మన ఆలోచన విధానం, సమాజ దృక్పదాన్ని మార్చగల శక్తి శాస్త్రీయ అక్షరాస్యత, మానసిక ధోరణితోనే సాధ్యమవుతుందన్నారు. ఇదే సమయంలో పుస్తక పరిచయాన్ని సైతం ఆయన చేశారు. కార్యక్రమంలో రచయిత లావుడియా రమేష్‌బాబు, డేవిడ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ అధికారుల నియామకం ఎప్పుడో?

రాత పరీక్ష కోసం అభ్యర్థుల ఎదురుచూపు

కొత్తగూడెంటౌన్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టింది. జూన్‌లో ఖాళీగా ఉన్న 12 జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు సింగరేణి వ్యాప్తంగా 17 మంది దరఖాస్తులు చేసుకున్నారు. జూన్ నుంచి నియామకాలకు సంబందించి యాజమాన్యం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలకు సిద్ధమై ఎదురు చూపులు చూస్తున్న పరిస్థితి నెలకొంటుంది. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే జూనియర్ ఇన్‌స్పెక్టర్ ల పోస్టులు 12 ఖాళీగా ఉండడంతో వాటిని భర్తీ చేయడంలో జాప్యం చేయడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా సెక్యూరిటీ విభాగంలో సింగరేణి సిబ్బంది తుగ్గుముఖం పట్టడం ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది రోజు రోజుకి పెరగడం వల్ల పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు అధికారులు ఆవేదన చెందుతున్నారు. సింగరేణి యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకుని రిక్రూట్‌మెంట్ సెల్‌లో పెండింగ్‌లో ఉన్న జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేసేవిధంగా చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. యాజమాన్యం వెంటనే ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

96 ప్యాకెట్లలో 4.99క్వింటాళ్ల గంజాయి..

ఏఎస్ఆర్ జిల్లా నుంచి జైపూర్‌కు తరలిస్తుండగా పట్టివేత

కంటైనర్, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న సుజాతనగర్ పోలీసులు

ఇద్దరు అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు

వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



విలేకరుల సమావేశంలో నిందితులతో పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న దృశ్యం

సుజాతనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్) జిల్లా నుంచి జైపూర్‌కు ఓ కంటైనర్‌లో తరలిస్తున్న సుమారు 4.99క్వింటాల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం ఇల్లా సుజాతనగర్ పోలీసులు పటుకున్నారు. 96ప్యాకెట్లలో తరలిస్తున్న ఆ గంజాయి విలువ 2.50కోట్లు ఉంటుందని అంచనా. ఈ ఘటనలో సుజాతనగర్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి, కంటైనర్‌ను, నిందితుల నుంచి కీప్యాడ్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను సోమవారం భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సోమవారం కర్ణాటకకు చెందిన జగదీష్ దయారాంపాటిల్, మహారాష్ట్రకు చెందిన సంజూకుమార్ అనే ఇద్దరు వ్యక్తులు లారీ కంటైనర్‌లో గంజాయిని ఏపీలోని అల్లూరిజిల్లా నుంచి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం మీదుగా రాజస్థాన్‌లోని జైపూర్‌కు రవాణా చేస్తున్నారని వచ్చిన సమాచారంతో సీసీఎస్, సుజాతనగర్ పోలీసులు ఎస్సై రమాదేవి నేతృత్వంలో మండలంలోని వేపలగడ్డ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కంటైనర్‌ను ఆపి తనిఖీ చేయగా దానిలో 96 ప్యాకెట్లలో గంజాయి ఉండటాన్ని గుర్తించారు. ఆ గంజాయి 4.99 క్వింటాలు ఉండగా దాన్ని స్వాధీనం చేసుకుని, రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇక వారితో పాటు పాటు వారికి గంజాయిని విక్రయించిన, కొనుగోలు చేసిన ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. రవాణా చేస్తున్న జగదీష్ దయారాంపాటిల్, సంజూకుమార్‌ను అరెస్ట్ చేశామని, నిందితుల్లోని మహారాష్ట్రకు చెందిన అమిత్ రోహిదాస్‌పాటిల్, గంజాయిని అమ్మిన ఒడిశా రాష్ట్రానికి చెందిన హరి(జైపూర్)పరారీలో ఉన్నారన్నారు. గతంలో కూడా వీరు పలు గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నారని, 2024 ఏప్రిల్‌లో జగదీష్ దయారాం పాటిల్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి గంజాయిని తరలిస్తుండగా విశాఖపట్టణం పాడేరు పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఇక అదే ఏడాది డిసెంబరులో సంజు కుమార్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి గంజాయి తరలిస్తుండగా బీదర్ జిల్లా ఔరద్ పోలీసులు అరెస్ట్ చేశారని వివరించారు. తాజాగా 4.99క్వింటాళ్ల గంజాయి, నేరస్థులను పట్టుకోవడంలో సహకరించిన సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సుజాతనగర్ ఎస్సై రమాదేవిని, సిబ్బందిని, కేసు విచారణకు సహకరించిన సీఐ ఆర్ వెంకటేశ్వర్లును, కేసును పర్యవేక్షించిన కొత్తగూడెం డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్‌ను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

ఇంటిపిల్లర్‌పై పడిన పిడుగు



ఇంటి పిల్లర్‌పై పడిన పిడుగు దృశ్యం

ఖమ్మంరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఉరుములు, మె రుపులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న గంధం యాకయ్య ఇంటి పిల్లర్‌పై అర్ధరాత్రి పిడుగు పడింది. దీంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం ఉదయం డాబాపైకి వెళ్లి చూసేసరికి ఇంటి పిల్లర్‌పైన పిడుగు పడటంతో ఆ పిల్లర్ పాక్షికంగా ధ్వంసం అయింది. పిడుగు ప్రమాదం పాక్షికంగా ఉండటంతో ఇంటికి, ఇంట్లో ఉన్న వారికి పెను ప్రమాదం తప్పినట్లయింది.

లారీ బోల్తా : డ్రైవర్లకు స్వల్పగాయాలు

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి లారీ బోల్తాపడిన సంఘటన అశ్వారావుపేటలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్ నుంచి ఆంధ్రాకు చేపల మేతతో వస్తున్న లారీ అశ్వారావుపేట సమీపంలో భద్రాచలం రోడ్‌లో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదంలో లారీ డ్రైవర్లు ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి.

ఇద్దరు గిరిజన విద్యార్థినుల అదృశ్యం

దమ్మపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట మండలం అంకంపాలెం గిరిజన గురుకుల జూనియర్ కళాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం అయ్యారు. ఈ ఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆదివారం ఉదయం కళాశాల వసతి గృహం నుంచి ఎలాంటి సమాచారం లేకుండా బయటకు వెళ్లారు. కళాశాలలో విద్యార్థినులు కనిపించక పోవటంతో ఈ విషయం గుర్తించిన కళాశాల వార్డెన్ సమాచారాన్ని బాలికల తల్లిదండ్రులకు అందించారు. సాయంత్రం వరకు విద్యార్థినులు కళాశాలకు రాకపోవటంతో ఆచూకీ కోసం ప్రయత్నించినా లభించకపోవటంతో కళాశాలకు చెందిన జూనియర్ లెక్చరర్ బానోతు హరిత ఆదివారం రాత్రి దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినులు సత్తుపల్లి మండలంలోని ఒకే గ్రామానికి చెందినవారు కావటం గమనార్హం.

భయపడి సమాచారం ఇచ్చిన విద్యార్థినులు

కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన ఘటనతో తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. విద్యార్థినిలే భయపడి వారు ఎక్కడ ఉన్నది తెలుపుతూ సోమవారం రాత్రి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు సమాచారం ఇవ్వడంతో కళాశాల యాజమాన్యం, పోలీసులు అప్రమత్తమై ఖమ్మం బస్టాండులో ఉన్న విద్యార్థినిలను అదుపులోకి తీసుకొన్నారు. అదృశ్యమైన విద్యార్థినులు ఆచూకీ లభించటంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

సైబర్ నేరస్థుడి అరెస్టు

ఖమ్మంక్రైం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పార్టుటైం జాబ్స్ ఇన్వెస్టుమెంట్స్ అంటూ.. డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసిన కేసులో ఒకరిని సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేసినట్టు సీపీ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేంసూరు మండలంకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి టెలిగ్రాం ద్వారా ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఇన్వెస్టుమెంట్ చేస్తే అధికలాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ.30లక్షలు ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నాడు. అనంతరం మోసపోయినట్టు గమనించిన బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు సైబర్ నేరగాడిని మహారాష్ట్రాలోని ఔరంగాబాద్ జిల్లా ఛత్రపతి శంభాజీనగర్‌లో గుర్తించి అరెస్టు చేసి సోమవారం ఖమ్మం తీసుకువచ్చినట్టు తెలిపారు. అనంతరం అతన్ని సైబర్‌క్రైం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు సీపీ తెలిపారు. ఈవిచారణలో ముఖ్యపాత్ర వహించిన డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ ఫణిందర్, సీఐల ఎస్కే యాసిన్, కే.నరేష్, ఎస్ఐలు కృష్ణ, విజయ్‌కుమార్ కానిస్టేబుల్స్, సిబ్బందిని అభినందించారు.

పూరిల్లు దగ్ధం

ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కోరం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదం సంభవించి ఓ పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని మేళ్ళమడుగు గ్రామంలో సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో వట్టం నాగేశ్వరరావుకు చెందిన పూరిల్లు కాలిబూడిద కాగా రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించింది. గ్రామానికి చెందిన వట్టం నాగేశ్వరరావు, జానకీ దంపతులు సోమవారం ఇంటికి తాళంవేసి మండలంలోని పెట్రాంచెలకలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో విద్యుత్‌షాట్ సర్క్యూట్ కావడంతో పూరింటికి మంటలు అంటుకొని పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో తమ ఇద్దరు కుమార్తెలకు సంబంధించిన సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు, రూ.50వేలు నగదు, నిత్యావసర వస్తువులు, బట్టలు, సామగ్రి మొత్తం పూర్తిగా కాలిపోయింది. టేకులపల్లి ఆర్ఐ సౌజన్య సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. విషయం తెలుసుకొన్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మేళ్లమడుగు గ్రామానికి వెళ్లి అగ్నిప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అగ్నిప్రమాద బాధితుడు నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఆర్ఐ సౌజన్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

అశ్వాపురంలో రేకుల ఇల్లు..

అశ్వాపురం : మండల కేంద్రమైన అశ్వాపురం శివారు మంచికంటినగర్‌లో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో రేకుల ఇళ్లు దగ్ధం కాగా, సుమారు రూ.లక్ష ఆస్థి నష్టం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మంచికంటినగర్‌కు చెందిన ఈసరస్వతి అనే మహిళ సోమవారం పూజచేసుకొనే సమయంలో ఇంట్లో దీపం వెలిగించింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ ఆ దీపం బట్టలకు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపుచేసేలోపు ఇంట్లోఉన్న బియ్యం, వంట సామగ్రి, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. సంఘటనా స్థలాన్ని అశ్వాపురం ఆర్ఐ లీలావతి సందర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

అశ్వాపురం అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన దూదిమెట్ల సరిత(35) అనే యువతి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సోమవారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భర్తతో మనస్పర్థలు రావటంతో సరిత గత కొన్నేళ్లగా మల్లెలమడుగులోని పుట్టింట్లో ఉంటూ భద్రాచలంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తోంది. ఈనేపధ్యంలో సరితకు భద్రాచలం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేట్ అటెండర్‌గా పనిచేస్తున్న పోతురాజు గురుమూర్తితో పరిచయం ఏర్పడింది. దీంతో అతను, సరిత వద్ద కొంత నగదు తీసుకోవటమే కాక, కొంతకాలంగా ఆమెను మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడు. ఇది భరించలేని ఆమె ఈనెల 11న తన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈఘటనపై మృతురాలి సోదరుడు ఉడతల లింగమల్లు ఫిర్యాదు మేరకు గురుమూర్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.


యువకుడి బలవన్మరణం

తల్లాడ, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన యువకుడు సోమవారం మృతిచెందాడు. మండలంలోని మల్సూర్ తండాకు చెందిన మాలోతు మణికంఠ (19) మృతిచెందాడు. తండాలోని ఓ ఇంటి వద్ద నాలుగు రోజుల క్రితం మణికంఠ పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నంకు పాల్పడ్డాడు. దీంతో అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రేమవిఫలమే ఆత్మహత్యకు కారణమని తెలిసింది.

ఇంటిఎదుట ఉంచిన మోటార్‌సైకిల్ చోరీ

కారేపల్లి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శ్రీధర్ అనే వ్యక్తి ఇంటి ఎదుట నిలిపిన మోటార్‌సైకిల్‌ను సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. దీంతో తన మోటార్‌సైకిల్ చోరీకి గురైందని భావించిన శ్రీధర్ సోమవారం రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృత్యువాత



కారేపల్లి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోడితలగూడెం గ్రామంలో సోమవారం శ్యాంలాల్ సాహు అనే రైతుకు చెందిన ఎద్దులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. రైతు కథనం ప్రకారం తన జత ఎడ్లను పంట చేలోనే పక్కనే ఉన్న విద్యుత్ స్థంబానికి తాడుతో కట్టేశాడు. అయితే విద్యుత్ స్థంబానికి విద్యుత్ సరఫరా కావడంతో వాటికి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన ఎద్దుల విలువ సుమారు రూ.లక్షన్నరకు పైగానే ఉంటుందని రైతు తెలిపాడు. ఈ మేరకు తనను ప్రభుత్వం ఆదుకోవాలని జరిగిన నష్టానికి పరిహారం అందించాలని వేడుకున్నాడు.

పైనంపల్లిలో శిలాఫలకం ధ్వంసం..



పైనంపల్లి గ్రామంలో దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకం

నేలకొండపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైనంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి మంత్రి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం దిమ్మెను కొంతమంది దుండగులు కూల్చివేసారు. వివరాల్లోకి వెళితే శనివారం రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి మండలపరిధిలోని ముజ్జుగూడెం, పైనంపల్లి గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పైనంపల్లి గ్రామంలో రూ.15లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అందుకోసం గ్రామంలోని ఆర్సీఎం చర్చి సమీపంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేసివెళ్లిన అనంతరం శిలాఫలకాన్ని చర్చి సమీపంలో ఏర్పాటు చేయటంపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపధ్యంలో ఆదివారం రాత్రి గొర్రె సతీష్, కుక్కల రమేష్, చాట్ల వాసు, రాయబారపు రమేష్‌లు శిలాఫలకం దిమ్మెను ధ్వంసం చేసి, శిలాఫలకాన్ని రెండు ముక్కలు చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసే సమయంలో వీడియో తీసి గ్రూపుల్లో పెట్టారని తెలుస్తున్నది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఫలకం దిమ్మెను, శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా సమాచారం.

పోలీసుస్టేషన్ ఆవరణలో ఇరువర్గాల ఘర్షణ



దాడిలో గాయపడిన హెచ్‌సీ బాలు

తిరుమలాయపాలెం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకన్న కొత్తజంటకు రక్షణ కోసం తిరులాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు రాగా సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణలో హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. మండలంలోని గోల్‌తండాకు చెందిన బోడ కీర్తన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అందనాల పాడు గ్రామశివారు కొత్తతండాకు చెందిన అంగోత్ నవీన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం వారు సోమవారం తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఈక్రమంలో స్టేషన్ ఆవరణలో అమ్మాయి, అబ్బాయి బంధువులు బంధువుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో గొడవ నివారించేందుకెళ్లిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ గుగులోత్ బాలును రఘునాధపాలెం మండలం వీవీపాలెంకు చెందిన వివేక్, నవీన్, బాజీలు కలిసి హెడ్‌కానిస్టేబుల్‌ను కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని ఖమ్మంకు చికిత్స కోసం తరలించారు. బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

మున్నేరు వరదలో చిక్కుకున్న ఇసుక ట్రాక్టర్లు

ముదిగొండ, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం పెద్దమండవ మున్నేరు వద్ద సోమవారం ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో మూడు ఇసుక ట్రాక్టర్లు చిక్కుకున్నాయి. మున్నేరు వరద ఉధృతి ఉదయం బాగానే ఉన్నప్పటికీ మధ్యాహ్నానికి పెరిగింది. నీటి ప్రవాహాన్ని గమనించిన కూలీలు ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో ట్రాక్టర్లలో ఇసుక లోడ్‌చేసి ఉండటంతో మున్నేరులోనే ట్రాక్టర్లను వదిలేసి డ్రైవర్లు ఒడ్డుకుచేరారు. వరద ప్రవాహంలో మూడు ట్రాక్టర్లు చిక్కుకున్నాయి. వరద ఉధృతి తగ్గితేనే ట్రాక్టర్లను బయటకు తీసే అవకాశం ఉంది.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బొందిలి రామారావుకి చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.8 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం ఒకటవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి టిక్కుమ్ రజని సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా.. ఖమ్మం పట్టణం రోటరీ నగర్ ప్రాంతానికి చెందిన కోటకొమ్ముల నాగరాజు వద్ద నిందితుడు కుటుంబ అవసరాల నిమిత్తం 2019నవంబరు 16న రూ.8లక్షలు అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీనోట్ రాయించి ఇచ్చినాడు. తరువాత ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా 2021అక్టోబర్ 25న రూ.8 లక్షలకు చెక్కును నిందితుడు ఫిర్యాదుకి ఇచ్చాడు. ఆ చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమచేయగా సిగ్నేచర్ తేడా ఉందని బ్యాంక్ వారు మెమో ఇచ్చారు. దీంతో ఫిర్యాదుదారుడు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు ఇచ్చాడు. కోర్టులో కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

వీవీసీ పాఠశాల విద్యార్థికి బంగారు పతకం



ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీవీసీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థి తాళ్లూరి. వీర్‌శిశిర్‌కౌషల్ రోల్లర్ స్కేటింగ్ 200మీటర్ల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడని పాఠశాల యాజమాన్యం సోమవారం తెలిపింది. సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన 12వస్టేట్ ఇంటర్ డిస్ట్రిక్‌రోల్లర్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. 4నుంచి 6సంవత్సరాల 200వందల విభాగంలో గోల్డ్‌మెడల్, 50వందల మీటర్ల విభాగంలో సిల్వర్‌మెడల్ సాధించాడు. విద్యార్థిని కరస్పాండెంట్, సెక్రటరీ రేఖల భాస్కర్, ప్రిన్సిపాల్ విద్యులత, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పంట కొనుగోళ్లు సజావుగా జరగాలి

- ధాన్యం, పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ అనుదీప్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ధాన్యం, పత్తి పంటల కొనుగోళ్లు సజావుగా జరిగేలా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ధాన్యం,పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్లు శ్రీజ,పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్షించారు.గన్నీబ్యాగులను కొనుగోలు కేంద్రాలవద్ద కోతల ప్రారంభమైన తర్వాత అందుబాటులో ఉంచాలన్నారు. పత్తి కొనుగోలు కూడా సజావుగా జరగాలన్నారు.సమావేశంలో సివిల్‌సప్లై డీఎంశ్రీలత,జిల్లామార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా నిర్మాణాలు వేగిరం చేయాలి

యంగ్ ఇండియా సమీకృత గురుకులాల విద్యాలయ భవనాల నిర్మాణాలను వేగిరం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో యంగ్ ఇండియా గురుకులాల విద్యాలయ భవనాల నిర్మాణం, పబ్లిక్ స్కూల్‌పై అదనపు కలెక్టర్లు శ్రీజ,పి.శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈవిద్యాలయ నిర్మాణాలపై 24 గంటలలోపు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. పనులు ఎక్కడా జాప్యం కాకుండా నిర్వహించాలన్నారు. ప్రతీఅసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో 3500పైగా పిల్లలకు వసతి కల్పించేలా అంతర్జాతీయప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ప్రభుత్వం నిర్మిస్తోందని కలెక్టర్ చెప్పారు. జూనియర్ కళాశాలల మరమ్మతులకు రూ.2కోట్ల90లక్షల నిధులు మంజూరి చేశామని, వీటిని సక్రమంగా వినియోగించి అవసరమైన పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రీనివాసచారి, డీఐవో రవిబాబు, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రోజుకు రెండుమార్లు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలి

కలెక్టరేట్‌లో పనిచేసే అన్ని శాఖల అధికారులు సిబ్బంది విధులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందిరా డెయిరీ, జాతీయరహదారులు, ఉద్యోగుల అటెండెన్స్‌పై అదనపు కలెక్టర్లు శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌లో పనిచేసే వివిధ శాఖల అధికారులు, సిబ్బంది నూరుశాతం బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం రెండుసార్లు నమోదు చేయాల్సిందేనని అన్నారు. సాయంత్రం హాజరు వేయకుండా వెళ్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా అధికారులకు సూచించారు. ఇందిరా డెయిరీ సమగ్రనివేదికలను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మధిర ఔటర్ రింగురోడ్డు, హైలెవల్ బ్రిడ్జి జాతీయ రహదారి పనుల పెండింగ్ భూసేకరణ పనులను వేగిరం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో ఇటీవల గుండెపోటుతో చాలా మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే సీపీఆర్ చేయడం వలన మనిషి ప్రాణాలను కాపాడే ఆస్కారం ఉందన్నారు. సీపీఆర్ చేసేందుకు వైద్యరంగంలో ఏలాంటి అనుభవం అవసరం లేదని సాధారణ మనుషులు కూడా సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, పి శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతీభాయి, సీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు చందూనాయక్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముం తనిఖీ

నెలవారీ తనిఖీల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. గోదాము సీల్‌ను తీసి ఈవీఎం, వీవీప్యాట్లు ఉన్న గదికి సీల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఫైర్ అలారం సరిచూసుకోవాలని అగ్నిమాపక యంత్రాలు కండీషన్‌లో ఉంచాలని సూచించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.

15న సదరం డేటా ఎంట్రీ ఆపరేట్ నియామకానికి రాతపరీక్ష

సదరం కార్యక్రమంలో రెండు డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ద్వారా అర్హులైన అభ్యర్థుల ఎంపిక కోసం అక్టోబరు 15న మధ్యాహ్నం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఇంటర్నెట్ వినియోగంపై ప్రావీణ్యత, డేటాఎంట్రీలో అనుభవం కలిగిన అభ్యర్థులు అక్టోబరు 14లోగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.





పార్కులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రహదారి ప్యాచ్‌వర్కు పరిశీలిస్తున్న దృశ్యం

అందమైన నగరంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి
- మరుగుదొడ్లు, పారిశుధ్యం, రహదారుల వెంట దుమ్ముపై ఆగ్రహం
- పార్కులు,ప్యాచ్ వర్క్‌లపై సంతృప్తి
- ఉదయం 5.30 నుంచే నగరంలో పర్యటన

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరాన్ని అందమైన నగరంగా అద్దంలా తీర్చిదిద్దాలని కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి ఆదేశించారు. సోమవారం ఉదయం5.30కే కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి నగరంలో పారిశుధ్యం, డ్రైయినేజీలు, పార్కులు, ఇంజనీరింగ్ పనుల పరిశీలన చేపట్టారు. కాల్వొడ్డు, మయూరిసెంటర్, పాతబస్టాండ్,జడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, ఎన్టీఆర్‌సర్కిల్ నుంచి బైపాస్ వరకు ఈ పరిశీలన జరిపారు. క్షేత్రస్థాయిలో కేఎంసీ విభాగాల బాధ్యులను వెంట తీసుకొని తనిఖీలు చేశారు. తక్షణం ఆదేశాలిచ్చారు. కాగా నగరంలో పార్కులు, ప్యాచ్ వర్క్‌లను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కాల్వొడ్డులో పార్కులను కలెక్టర్ నేరుగా పరిశీలించి వాకర్స్ అభిప్రాయాలు సేకరించారు. పార్కుల నిర్వాహణ బాగుందని వాకర్స్ తెలిపారు. తర్వాత 45వ డివిజన్ మయూరిసెంటర్‌లో కార్మికులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. కార్మికులు కనీసం యూనిఫాం చేతులకు గ్లౌజ్‌లు, కాళ్లకు బూట్లు లేక పోవటంపై జవాన్ భద్రయ్యను ప్రశ్నించారు. గ్లౌజ్‌లు, బూట్లు, దుస్తులు ఖచ్చితంగా దరించాలని కలెక్టర్ ఆదేశించారు. అక్కడే హాజరు రికార్డులను పరిశీలించారు. సరిగా హాజరు తీసుకుంటున్నారా లేదా తెలుసుకున్నారు. జడ్పీ సెంటర్‌లోని ప్రభుత్వ హాస్పటల్ వద్ద ప్రజా మరుగుదొడ్డిని పరిశీలించిన కలెక్టర్ జవాన్ శివారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని జవాన్ పరిశీలించి సంతకాలు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయ సేకరణ రికార్డులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. సిటిజెన్ ఫీడ్‌బ్యాక్ బోర్డులు పెట్టాలని ఆదేశించారు. ధర్నాచౌక్‌ను పక్కనే ఖాళీగా స్థలాలు ఎందుకు శుభ్రం చేయించలేదని జవాన్ శివారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత 54వ డివిజన్ ఇల్లెందు క్రాస్ రోడ్డులో దుమ్ము, మట్టి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక జవాన్ చూరుపల్లి శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుమ్ము, మట్టి నిల్వలను తొలగించాలని అనాధికారికంగా ఫ్రూట్‌స్టాల్ నిర్వహణ జరుగుతుంటే ఏమీ చేస్తున్నారని మందలించారు. విద్యుత్ స్టోర్ వద్ద ఐటీహబ్ వద్ద ప్యాచ్ వర్కులు మంచిగా ఉన్నాయని కలెక్టర్ అనుదీప్ ఇంజనీరింగ్ అధికారులను మెచ్చుకున్నారు. డివైడర్లు, రోడ్డు స్వీపింగ్ పనులు పరిశీలించారు. ఎన్టీఆర్ సర్కిల్ డివైడర్లు పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్ అన్ని దెగ్గరుండి సూచుకోవాలని ఆదేశించారు. ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తానని కలెక్టర్ అనుదీప్ హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఈఈ కృష్ణలాల్, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, డీఈ ధరణ్, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ సందర్శించిన శ్రీచైతన్య విద్యార్థులు

ఖమ్మంరూరల్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోన్నేకల్లు పరిధిలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాలేరు మినీ హైడెల్ పవర్ ప్లాంట్, సబ్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ ఈ సందర్శనతో ఇంజనీరింగ్ కాన్సెప్ట్‌కు ప్రాక్టికల్ కనెక్షన్ ఏర్పడుతుందన్నారు.అకడమిక్ జ్ఞానం మరియు విద్యుత్ ఉత్పత్తి మరియు పంపిణీ వ్యవస్థలపై ప్రాక్టికల్ అవగాహన పొందుతారన్నారు. పరిశ్రమలో జరిగే ప్రాసెస్‌లను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ నియామకాలలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సాయి గీతిక, శ్రీవిద్య, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, రాజేష్, సీహెచ్ కృష్ణ ప్రసాద్, వి.సుదర్శన్ పాల్గొన్నారు.



పాలేరులో పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

నేలకొండపల్లి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారుడు నేలకొండపల్లికి చెందిన రాగి వీరబ్రహ్మాచారిస్వామి స్వగృహంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. 18 మెట్లు కట్టి, రకరకాల పూలతో అలంకరించిన మండపాన్ని తయారు చేసి అయ్యప్పలు పడిపూజను నిర్వహించారు. గురుస్వామి మురుగన్ ఆధ్వర్యంలో గురుస్వాములు కనపర్తి కోటేశ్వరరావుస్వామి, పావులూరి వెంకటేశ్వరరావుస్వామి పడిపూజను నిర్వహించారు. ఆదివారం ఉదయం అభిషేకాలు చేసిన అనంతరం రాత్రి 9గంటలకు పడిపూజను ప్రారంభించారు. పడిపూజ అనంతరం అన్నదాన కార్యక్రమంతో పడిపూజను ముగించారు. పడిపూజలో 125 మంది అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.



పడిపూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

విద్యార్థిని కుటుంబానికి ఆర్థికసాయం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్జేసీ కళాశాల పూర్వవిద్యార్థి పోలం శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. వారిది పేద కుటుంబం కావటంతో ఆర్జేసీ కళాశాల పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.60వేలు సేకరించారు. సోమవారం నగరంలోని ఆర్జేసీ కళాశాలలో మృతుడి కుమార్తెకు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ చేతుల మీదుగా నగదు అందించారు. లక్ష్యంతో చదువుకుని భవిష్యత్‌ను మంచిగా నిర్మించుకోవాలన్నారు. నిరుపేద విద్యార్థికి అండగా నిలవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేసీ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఏ లింగయ్య, పూర్వవిద్యార్థులు సురేష్, జగదీష్, సూర్య, సంధ్య, శిరీషా, లక్ష్మీనారాయణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందిస్తున్న చైర్మన్ కృష్ణ

28వ డివిజన్‌లో ఓట్ చోరీ సంతకాల సేకరణ

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):ఏఐసీసీ పిలుపుమేరకు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో నగరంలోని 28వ డివిజన్‌లో ఓట్ చోరీ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ గజ్జల వెంకన్నలక్ష్మీ ఆధ్వర్యంలో ఓటు విలువ, దొంగ ఓట్లుపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ దొంగోట్లతో పలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. సేకరించిన సంతకాలను జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్‌కు అందించారు. అంతకుముందు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన ర్యాలీలో 28వ డివిజన్ నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంతకాల పత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ

రైతుల గుండెల్లో.. వాన దడ

(5వ పేజీ తరువాయి)

పడుతున్న వానలు వరిరైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఏపుగా ఎదిగి కోతకు వచ్చిన వరిపైరు నేల వాలుతుండటంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు. జిల్లాలో ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో పైరా, కల్లూరు మండలాల్లోనే వరి అధికంగా సాగువుతుంది. ఇక కల్లూరు మండలంలో ఈఏడాది సుమారు 34వేల ఎకరాల్లో వరి వేయగా.. గత జూన్, జూలై నెలలో సాగు చేసిన సన్నరకం జేజీఎల్-28545, బీపీటీ 5204సాంబ రకాలు కోతకు వచ్చాయి. అయితే ఆదివారం రాత్రి నుంచి సోమవారంఉదయం వరకు పడిన భారీవర్షం మండలంలోని గోపాలదేవబోయినపల్లి, ఎర్రబోయినపల్లి చంద్రుపట్ల, రఘునాథబంజర, లింగాల, వాచ్యానాయక్‌తండ, తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పైరు ఆది,సోమవారాల్లో కురిసిన వర్షాలకు నేలవాలింది. దాంతో కోత యంత్రాలు తిరగడం ఇబ్బందిగా ఉంటుందని, ఫలితంగా సమయం ఎక్కువ పట్టి.. వాటి కిరాయి ఎక్కువవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపిలేని వానలు, వాతావరణ పరిస్థితులతో ఎండుతెగులు, కాటుకతెగులతో వేలాది ఎకరాల్లో వరికినష్టం వాటిల్లుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దాంతో దిగుబడి 50శాతంతగ్గి పెట్టుబడులు భారంగా మారతాయని భయపడుతున్నారు.

గోళ్లపాడు కాలువ పనులు పూర్తి చేయాలి

ఖమ్మంఅర్బన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గోళ్లపాడు మురుగు కాల్వ పనులను వెంటనేపూర్తి చేయాలని సీపీఎం డివిజన్ నాయకులు ఎస్కే హిమాం డిమాండ్ చేశారు. సీపీఎం 30వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గోళ్లపాడు ఛానెల్ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో రంగు హనుమంతచారి, యర్రా నగేష్,పెద్దోజు ఉపేంద్రచారి, సుగ్గల హనుమంతరావు, జంగం నగేష్ మద్ది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు తక్షణం పరిష్కరించాలి

- కమిషనర్ అభిషేక్ అగస్త్య
- కేఎంసీలో వినతులు స్వీకరణ
- ఇందిరమ్మ లబ్ధిదారులకు అందని పట్టాలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు తక్షణం పరిష్కరించాలని ఖమ్మంనగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. కేఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలిచ్చారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించారు. నూతనంగా 41 దరఖాస్తులు కమిషనర్‌కు ప్రజలు అందించారు. 36వ డివిజన్‌లో తండ్రి పేరుమీద ఉన్న తన పేరుమీదకు రిజిస్ట్రేషన్ జరిగిందని మున్సిపాలిటీలో మాత్రం మార్పు కాలేదని కుమ్మరికుంట్ల బిక్షం దరఖాస్తులు చేశారు. గొల్లగూడెంలో ఇంటి నెంబర్ తప్పుగా నమోదు జరిగిందని సరిచేయాలని మరో మహిళ కోరారు. శ్రీరామ్‌హిల్స్‌లో ఇంటి పన్నులు తప్పుగా నమోదు జరిగాయని పరిష్కరించాలని వినతిపత్రాలు అందించారు. గట్టయ్య సెంటర్‌కు చెందిన వారు మంచినీటి కనెక్షన్ కోసం దరఖాస్తులు చేశారు.వెంకటేశ్వరనగర్‌లో ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయని వాటిని శుభ్రం చేయాలని విన్నవించారు. రామచంద్రనగర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా సెల్‌టవర్‌కు ఓ కుటుంబం అనుమతిందని వెంటనే నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని పెద్దఎత్తున మహిళలు ఫిర్యాదు చేశారు.

ఇందిరమ్మ లబ్ధిదారుడికి అందని పట్టా

కేఎంసీలో ఇందిరమ్మ విభాగం ఉద్యోగులు చేసిన ఆన్‌లైన్ తప్పిదం గిరిజన ఇందిరమ్మ లబ్ధిదారులకు నెలల తరబడి ఇబ్బంది తప్పటం లేదు. కేఎంసీ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న బాలసాని సుభాషినికి తొలి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు జరిగింది. కేఎంసీలోని కంప్యూటర్ ఆపరేటర్లు లబ్ధిదారుని ఆధార్ నెంబర్ తప్పుగా నమోదు చేశారు. తర్వాత గృహనిర్మాణశాఖ పీడీ కార్యాలయం నుంచి ఆధార్ నెంబర్ సరిచేయించారు. కానీ కలెక్టర్ పోర్టల్ నుంచి మాత్రం ఇందిరమ్మ పట్టా మంజూరు కాలేదు. ఆమె పదేపదే ప్రజావాణిలో విన్నవిస్తూనే ఉన్నారు. కలెక్టర్ అనుదీప్ స్పందించి బాలసాని సుభాషిని ఇందిరమ్మ ఇంటి పట్టాను మంజూరు చేయాలని కోరారు.

బీజేపీలో చేరిన డాక్టర్ మారుతిగౌడ్

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):నగరంలోని న్యూరోసర్జన్‌గా పనిచేస్తున్న కే.మారుతిగౌడ్ హైదరాబాదులో బీజేపీ కార్యాలయంలో రాష్ట్రఅధ్యక్షుడు నారపనేని రామచంద్రరావు సమక్షంలో పార్టీలో చేరారు. రాష్ట్రఅధ్యక్షుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వీరితోపాటు మరో 50మంది కూడా పార్టీలో చేరినట్టు జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, సన్నే ఉదయ్‌ప్రతాప్, రామలింగేశ్వరరావు, సుబ్బారావు,ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మారుతిగౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

గవాయ్‌పై దాడికి నిరసన

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసనగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్‌మాదిగ మాట్లాడుతూ దాడి వెనుక శక్తులను గుర్తించి శిక్ష పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య, సామినేని భవాని , కూరపాటి సునిల్, పగిడికత్తుల ఈదయ్య, గాజుల నరిసింహారావు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన వారికి సీపీ అభినందన

ఖమ్మంక్రైం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఏఎస్‌లుగా ఉద్యోగోన్నతి పొందిన పలువురిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. పలుచోట్లవిధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతి పొంది ఖమ్మానికి కేటాయించడంతో అభినందించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ రామానుజం, పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ విద్యపై వివక్ష

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):బెస్ట్ అవైలబుల్ విద్యాపథకం ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీరుగారిపోయిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. సోమవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విద్య అందుతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి బెస్ట్ అవైలబుల్‌లో చేరారని ఇప్పుడు ప్రభుత్వం రియింబర్స్‌మెంట్ మంజూరు చేయకపోవటంతో విద్యార్థులను ఆయా కార్పొరేట్ పాఠశాలలు అనుమతించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు బాధ్యతలు నిర్వహించాలి

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు అప్పగించిన బాధ్యతలను నూరుశాతం పూర్తి చేయాలని ఖమ్మం టౌన్ మిషన్ కోఆర్డినేటర్ గుడిపూడి సుజాతరాణి పేర్కొన్నారు.సోమవారం నగరంలోని ఆర్పీలకు మెప్మా పథకాలు, లక్ష్యాలు, సర్వేలపై సమావేశం నిర్వహించారు. కొత్తమహిళా సంఘాలు నిర్మాణం, వీధివ్యాపారుల సంఘాలు ఏర్పాటు, యాచకుల సర్వే వరకు వివరించారు. ప్రతీ ఆర్పీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లు సల్మా, ఉపేంద్రమ్మ, ద్రౌపది, రోజా పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
ZONE
మంగళవారం 14 అక్టోబరు 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

పత్తికి మద్దతు ధర ప్రకటించాలి : ఏఐయూకేఎస్

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను ఆదుకునేందుకు సీసీఐ కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని అఖిల భారత ఐక్య రైతుసంఘం కల్లూరు డివిజన్ అధ్యక్షుడు ఒగ్గు నాగిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిన్నింగ్ మిల్లులు, సీసీఐ అధికారులు చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని, ఈ ఏడాది అధిక వర్షాలకు పత్తి దిగుమడి గణనీయంగా తగ్గిపోయిందన్నారు. దళారులు క్వింటాకు రూ.4-5వేలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, ఒకవైపు దిగుబడి లేక మరోకవైపు ధరలేక రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందని, కేంద్రాలను ప్రారంభించి రూ.8,110మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

అంబేద్కర్ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాల మహానాడు బాధ్యులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తితో, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో ఆ మహనీయుని పేరుతో అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమీషనర్ కొండ్రా నర్సింహాను మాల మహానాడు బాధ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. విగ్రహం కనిపించకుండా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి ప్రతిరోజూ శుభ్రం చేయించి మినీ పార్క్‌వలే అభివృద్ధి చేయాలని, విద్యుత్‌దీపాలతో అలంకరణ, సెంట్రల్ లైటింగ్, సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయాలని కోరారు. విగ్రహం చుట్టూతా తోపుడు బండ్లను తొలగించి స్కూల్ బస్సులు, వాహనాల అడ్డగోలు పార్కింగ్‌ను తీసివేయించాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కరిస్తానని కమీషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి కవితామల్లిక్, బాధ్యులు కోపల్లి రత్తయ్య, బల్లెం చిరంజీవి, సాలి పవన్‌కుమార్, తోటమళ్ల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

▸ మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ



మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహ

సత్తుపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ సూచించారు. సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీపావళి సందర్భంగా 14షాపులను ఏర్పాటు చేయనుండగా నిత్యం ఫైరింజన్ పర్యవేక్షణ ఉండాలని, అలాగే నిబంధనలను మీరితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి వై.వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రదీప్, విద్యుత్ ఏఈ ఉబ్బన శరత్‌బాబు, మునిసిపల్ మేనేజర్ శ్రీనివాస్, టీపీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: బీజేపీ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మధిర, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఆరు కాలం కష్టపడి సాగు చేసి గత రెండు నెలలుగా కురుస్తున్న అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు మధిర తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత రెండు నెలలగా కురుస్తున్న వర్షాలతో పెసర, మినుము పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయని పత్తి, వరి పైర్లు కూడా దెబ్బతినడం సగం కూడా దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల, పట్టణ అధ్యక్షులు గడ్డం శ్రీహరి, సుమంత్ నాయకులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

చింతకాని, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించిన వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి సోములపల్లి మానస పరిశీలించారు. ప్రస్తుత వాతావరణంలో తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉందన్నారు. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి అంచుల వెంబడి అలల మాదిరిగా ఎండిపోవడం జరుగుతుందన్నారు. లక్షణాలు గుర్తించిన వెంటనే నత్రజని ఎరువు వాడకం తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. తెగులు నివారణకు ఎలాంటి రసాయానిక మందులు లేవని తొలిదశలో లక్షణాలు గుర్తించిన వెంటనే ప్లాంటమైసిన్ లేదా పోషమైసిన్ 0.2 గ్రా లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. సమగ్ర యాజమాన్య చర్యలలో భాగంగా ఎకరాకు 15-20 కిలోల పొటాష్ ఎరువును వేయాలని, పొలంలో ఎప్పటికప్పుడు పాత నీరు తీసి కొత్త నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో కార్తీక్, రైతులు పాల్గొన్నారు.



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రైతుల గుండెల్లో.. వాన దడ

(5వ పేజీ తరువాయి)

పడుతున్న వానలు వరి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఏపుగా ఎదిగి కోతకు వచ్చిన వరి పైరు నేల వాలుతుండటంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు. జిల్లాలో ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో వైరా, కల్లూరు మండలాల్లోనే వరి అధికంగా సాగువుతుంది. ఇక కల్లూరు మండలంలో ఈ ఏడాది సుమారు 34వేల ఎకరాల్లో వరి వేయగా.. గత జూన్, జూలై నెలలో సాగు చేసిన సన్నరకం జేజీఎల్- 28545, బీపీటీ 5204 సాంబ రకాలు కోతకు వచ్చాయి. అయితే ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పడిన భారీ వర్షం మండలంలోని గోపాలదేవబోయినపల్లి, ఎర్రబోయినపల్లి చంద్రుపట్ల, రఘునాథబంజర, లింగాల, వాచ్యానాయక్‌తండ, తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పైరు ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు నేల వాలింది.

దాంతో కోత యంత్రాలు తిరగడం ఇబ్బందిగా ఉంటుందని, ఫలితంగా సమయం ఎక్కువ పట్టి.. వాటి కిరాయి ఎక్కువవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎడ తెరిపిలేని వానలు, వాతావరణ పరిస్థితులతో ఎండు తెగులు, కాటుక తెగులతో వేలాది ఎకరాల్లో వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దాంతో దిగుబడి 50 శాతం తగ్గి పెట్టుబడులు భారంగా మారతాయని భయపడుతున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎర్రుపాలెం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోనిజమలాపురం గ్రామంలో గల హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు సోమవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. పోషణ అభియాన్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి ఏసీడీపీవో కృష్ణశ్రీ వివరించారు. తక్కువ ఖర్చుతో ఇంటిలో లభించే పదార్థాలతో బలవర్థకమైన సమతుల్య ఆహారం ఎలా తయారు చేసుకోవాలో సంబంధిత పోషకపదార్థాలను ప్రదర్శించి వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషణ లోపాన్ని నివారించేందుకు ఆరోగ్య భారత్-ఆరోగ్య తెలంగాణ లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పోషణఅభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టాయని తెలిపారు. దీనిలో భాగంగా లబ్ధిదారులుకు మెరుగైన సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు విస్తృతమైన కృషి చేస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ఏఎెం వైద్యురాలుకుమారి హెల్త్ అసిస్టెంట్ సాయిరెడ్డి, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లక్ష్మి, నూర్జహాన్, ఆశాకార్యకర్తలు నాగమణి,సునిత పాల్గొన్నారు.

ఏన్కూరు: కామేపల్లి ఐసీడీఎస్ పరిధిలోని తిమ్మారావుపేట సెక్టార అంగన్‌వాడీ 4 సెంటర్‌లో సోమవారం సీమంతాలు, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బక్కమ్మ మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆవశ్యకత గురించి గర్భిణీలు, బాలింతలుకు వివరించారు. పౌష్టికాహారాన్ని తీసుకోవలని సూచించారు. ఆకుకూరలు, పాలు, పండ్లు, గుడ్లు ఎక్కువగా తీసుకోవలని సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.విజయ, ఎం.పద్మ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: మండల పరిధిలోని గేటుకారేపల్లిలో అంగన్‌వాడీ సెక్టార్‌లో సోమవారం గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై, చిన్నారులకు అన్నప్రసాన, వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవేంద్ర, ఏఎన్ఎం మహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుధారాణి, లక్ష్మి, విజయ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మారావుపేటలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం



కారేపల్లిలో...



ఎర్రుపాలెంలో...

15 వరకు 'అంబేద్కర్ ఓపెన్' ప్రవేశాలకు గడువు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు పొందుటకు ఈనెల 15వ తేదీ ఆఖరని స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులలో చేరగోరువారు ఇంటర్మీడియేట్, డిప్లొమా, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. 9491881910, 8187837058 సంప్రదించాలని కోరారు. మధ్యలో చదువు మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

వైరా, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్లతోపాటు అన్ని మండల కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలను వెంటనే ఏర్పాటుచేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో ఒకవైపున రైతులు తీవ్రంగా నష్టపోయి చేతికొచ్చిన పత్తి పంటను అమ్ముకోవటానికి సరైన ధర లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కీర్తి పురస్కారాన్ని అందుకున్న హరికిషోర్



కిషోర్‌కు కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మంత్రి పొంగులేటి

వైరా, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అస్ట్రాలజీ, న్యూమరాలజీ, పామిస్ట్రీ ఫేస్ రంగాల్లో ప్రసిద్ధిగాంచిన వైరాకు చెందిన డాక్టర్ దండు హరికిషోర్‌కు తెలంగాణ కీర్తి పురస్కార అవార్డును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో కీర్తి పురస్కార అవార్డును మంత్రి పొంగులేటి చేతులమీదుగా హరికిషోర్ అందుకున్నారు. గత 35ఏళ్లుగా పైన పేర్కొన్న రంగాల్లో హరికిషోర్ చేస్తున్న సేవలను మంత్రి అభినందించారు. చిన్న వయస్సులోనే సంస్కృత భాషలో ఆధ్యాత్మిక రంగానికి చెందిన శివపురాణం అనే పుస్తకాన్ని రచించటం అసాధారణమన్నారు. ఖమ్మం జిల్లాకు పేరు తీసుకువచ్చి కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని మంత్రి పొంగులేటి ఆకాంక్షించారు.

ఓట్‌చోరీకి పాల్పడిన బీజేపీ

మధిర, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీతోనే బీజేపీ అధికారంలోకి వస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ గుజరాత్, మహరాష్ట్రలో రాత్రికి రాత్రి ఓట్లను తొలగించి 60 లక్షల కొత్త ఓట్లను చేర్చి బీజేపీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఓటు చోరీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన యాత్ర విజయవంతం అయ్యిందని అన్నారు. దీనిపై దేశ వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపు మేరకు మధిర మండలంలో కూడా చేపట్టటం జరుగుతుందని ప్రతి గ్రామంలో వందకు పైగా సంతకాలు సేకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, నిడమానూరు వంశీ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: ఓటుచోరీకి నిరసిస్తూ సోమవారం తల్లాడ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. మండలంలో పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు జక్కంపుడి కిషోర్, సామినేని రామ అప్పారావు, మాజీ సర్పంచ్ దిరిశాల సత్యనారాయణ, దిరిశాల వెంకట నరసయ్య పాల్గొన్నారు.



మధిరలో మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్



కొత్తవెంకటగిరిలో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేంసూరు మండలంలో పెరుగుతున్న చోరీలు

▸ పట్టించుకోని పోలీసులు ▸ ఫిర్యాదు ఇచ్చినా జాడ లేని రికవరీ

వేంసూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. చోరీలతో మండల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల కాలంలో పలు చోరీలు జరిగిన సంఘటనల్లో ఫిర్యాదు ఇచ్చినా పెద్దగా చోరీ కేసులలో నిందితులను అరెస్టు చేసిన సంఘటనలు కూడా ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వేంసూరు మండల కేంద్రంతో పాటు మర్లపాడులలో ఇటీవల పలు చోరీ సంఘటనలు చోటు చేసుకున్నాయి. చైన్ స్నాచింగ్ కోసం కూడా ఒక వ్యక్తి ఇటీవల విఫలయత్నం చేయగా ఒక మహిళ ప్రతిఘటించి కేకలు వేయటంతో నిందితుడు పరారయ్యాడని స్థానికులు తెలిపారు. స్థానికంగా ఉన్న వ్యక్తే చైన్ స్నాచింగ్‌కు విఫల యత్నం చేసినట్లు ఫిర్యాదు చేసిన మేరకు అతనిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మండలంలో పలువురి ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. కాని ఇప్పటి వరకూ మోటార్ సైకిళ్లు దొరకని పరిస్థితి నెలకొంది. చోరీ కేసులలో ఫిర్యాదు ఇచ్చి రోజులు గడుస్తున్నా పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. అనుమాన ఉన్న నిందితుల గురించి చెప్పినా స్థానిక పోలీసులు పట్టించుకోవటం లేదని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కొందరు జిల్లా పోలీస్ కమిషనర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తేనే కదలిక వస్తోందని వాపోతున్నారు. పత్రికల్లో కథనాలు వస్తే ఏం జరుగుతుందనే ధోరణిలో కొందరు సిబ్బంది బహిరంగంగా వ్యాఖ్యానించటం చర్చనీయాంశంగా మారింది.

గవాయ్‌పై దాడికి నిరసన

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసనగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ప్రదర్శన, నిరసన తెలిపారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్‌మాదిగ మాట్లాడుతూ దాడి వెనుక శక్తులను గుర్తించి శిక్ష పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య, సామినేని భవాని, కూరపాటి సునిల్, పగిడికత్తుల ఈదయ్య, గాజుల నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నారుగూడెం సబ్‌స్టేషన్‌కు రూ.2కోట్లు మంజూరు



సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

తల్లాడ, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. గ్రామంలో 33/11కేవీ 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించనున్నారు. సోమవారం అన్నారుగూడెంలో 132కేవీ విద్యుత్ ఉపకేంద్రంలోని స్థలాన్ని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి పరిశీలించారు. ఈకార్యక్రమంలో డీఈలు రాములు, భద్రు, కృష్ణారావు, ఏడీఈలు సతీష్, ఖదర్‌బాబు, ఏఈ ప్రాద్, అపతి వెంకటరామారావు, తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు

చింతకాని, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భట్టి అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. సందర్భంగా పార్టీలో చేరిన వారికి మండల అధ్యక్షుడు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మడుపల్లి భాస్కర్, ఆత్మ కమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు, బండి వీరయ్య, వెంకటేశ్వర్లు, ఉదయ్, శ్రీను, ప్రభాకర్, సురేష్ పాల్గొన్నారు.

సంధ్యారాణిని స్ఫూర్తిగా తీసుకోవాలి



సంధ్యారాణిని సన్మానిస్తున్న దయానంద్

సత్తుపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్న శీలం సంధ్యారాణిని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వరరావు, శివకుమారి దంపతలు కుమార్తె సంధ్యారాణిని సోమవారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. 2016-17లో గ్రామంలోనే పదవ తరగతి పూర్తిచేసిన సంధ్యారాణి చెన్నైలోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ పూర్తిచేసి రాష్ట్రపతి చేతులమీదుగా ప్రశంసాపత్రం ఇటీవలే అందుకున్నారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్ధేశించుకుని గమ్యాన్ని చేరేవరకు విద్యార్థులంతా ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, కొడిమెల అప్పారావు, నరుకుళ్ల శేషగిరి, ఎన్.అప్పారావు, జీవీ.రమణ, మల్లిఖార్జున్, పానెం ఈశ్వర్ తదితరులున్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

పెనుబల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్‌ను పర్సంటేజీని పెంచి అమలుచేయాలని బీసీ రిజర్వేషన్ సాధన పోరాట సమితి మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వీఎంబంజర్‌లో మండల బీసీ రిజర్వేషన్ సాధన పోరాట సమితి ఆధ్వర్యంలో అన్ని బీసీ ఉపకుల సంఘాల ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు, మేధావులు, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్, సీపీఐ ఎంఎల్, టీడీపీ, కార్మికులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపిశెట్టి వెంకటేశ్వరరావు